సాక్షి ఆదిలాబాద్

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



51వ రోజుకు 'డివిజన్' దీక్ష

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని చేస్తున్న దీక్ష 51వ రోజుకు చేరింది. సోమవారం నాటి దీక్షలో మండలంలోని కరత్వాడ గ్రామస్తులు కూర్చున్నారు.



బోధనలో 'ఉత్తమం'

8లో▸

వినూత్న రీతిలో విద్యాబోధన చేస్తూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నారు ఉపాధ్యాయులు. నేడు టీచర్స్‌డే సందర్భంగా పలువురు ఉత్తమ ఉపాధ్యాయులపై కథనం.

గరిష్టం/కనిష్టం
32.0/25.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందించే అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. అలాగే అర్జీదారులు ఒకే సమస్యపై పదే పదే రాకుండా శ్రద్ధ వహించాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి ఆయన అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు అందించిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం శాఖల వారీగా అందిన దరఖాస్తులపై సమీక్షించారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, మున్సిపల్ కమిషనర్ శైలజ, జెడ్పీ సీఈవో గణపతి తదితరులు పాల్గొన్నారు.

వ్రతం ఆచరించి 'సమగ్ర' నిరసన



వ్రతం ఆచరిస్తున్న సిబ్బంది

కైలాస్‌నగర్: తమ సేవలను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా కలెక్టరేట్ ఎదుట గల దీక్ష శిబిరంలో సోమవారం సత్యనారాయణ స్వామివ్రతం ఆచరించి సర్కారు తీరుకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. తమను రెగ్యులరైజ్ చేసేలా సీఎం కేసీఆర్ మనస్సు కరిగేలా చూడాలని స్వామివారిని వేడుకున్నట్లుగా సిబ్బంది తెలిపారు. ఉద్యోగభద్రతతో కూడిన మినిమం టైం స్కేల్ అమలుపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసేంతవరకు తమ సమ్మె ఆపేదిలేదని స్పష్టం చేశారు. వీరి ఆందోళనకు బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు సుహాసినీరెడ్డి మద్దతు తెలిపారు.

సిరిచెల్మలో భక్తుల సందడి



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఇచ్చోడ: మండలంలోని అతిపురాతన సిరిచెల్మ మల్లికార్జున ఆలయం శ్రావణ సోమవారం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం చుట్టూ నీరుండడంతో కొంతమంది తెప్పలపై వెళ్లి దర్శించుకోగా, మరికొంత మంది నీటిలో నడుచుకుంటూ వెళ్లి పూజలు నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలని స్వర్ణకారుల దీక్ష



జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తూ..

కైలాస్‌నగర్: తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో జిల్లా స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట స్వర్ణకారులు ఒకరోజు దీక్ష నిర్వహించారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. ఎన్టీఆర్‌చౌక్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలుడిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, వేణుగోపాల్, నాయకులు రాజు, అజయ్, వినయ్, కిష్టయ్య పాల్గొన్నారు.

స్పౌజ్ టీచర్లు నిబంధనలు పాటించాలి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పని చేస్తున్న స్పౌజ్ టీచర్లు బదిలీల్లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్నప్పుడు నిబంధనలు పాటించాలని డీఈవో ప్రణీత ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు స్పౌజ్ పనిచేస్తున్న పాఠశాల, సమీపంలోని పాఠశాల, కార్యాలయాలకు మొదటి ప్రాధాన్యత ఆప్షన్ ఇవ్వాలి. అలా కాకుండా దూరపు పాఠశాలలు, మండలాలకు ఆప్షన్ ఇస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గురుభ్యోనమః



- ప్రోత్సహిస్తారు.. ఉన్నతంగా తీర్చిదిద్దుతారు
- ఉపాధ్యాయులే మార్గదర్శకులంటున్న ఉన్నతాధికారులు
- ఎంపీ సోయం, ఎమ్మెల్యే బాపూరావులిద్దరూ టీచర్లే..
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

గురువు.. మూడక్షరాలే అయినా తరాలను మార్చే సత్తా సొంతం. ఉపాధ్యాయుడు చూపిన మార్గంలో నడిచిన విద్యార్థి తన జీవితంలో అత్యున్నత శిఖరాలు అధిరోహించడం ఖాయం. పుస్తక పాఠాలతో పాటు తమ జీవిత అనుభవాలను వివరిస్తూ.. ప్రోత్సాహం అందిస్తూ.. స్ఫూర్తి నింపుతూ.. శిష్యుల భవితను తీర్చిదిద్దడంలో టీచర్ పాత్ర కీలకం. వారి మార్గదర్శకత్వంలో ఉన్నతంగా ఎదిగిన వారెందరో. ప్రస్తుతం జిల్లాలో ఉన్నతాధికారులుగా కొనసాగుతున్న పలువురు తమ గురువులతో ఉన్న అనుబంధాన్ని, అలాగే ఉపాధ్యాయ వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చిన ప్రజాప్రతినిధులు 'సాక్షి'తో తమ అనుభవాలను పంచుకున్నారు. ఉపాధ్యా య దినోత్సవం సందర్భంగా వారిపై కథనం. – ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్/బోథ్

నాన్నే.. మొదటి గురువు



మా నాన్న సాయి ప్రసాద్‌రావు నా తొలి గురువు. నాలుగో తరగతి చదివేటప్పుడు ఓసారి గణితంలో నాకు రెండు మార్కులే వచ్చాయి. అప్పటినుంచి ఆయన నాపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. మ్యాథ్స్‌లో రాణించేలా తీర్చిదిద్దారు. ఆయన మార్గదర్శకంలో చదివిన నేను పదో తరగతిలో వందకు 98 మార్కులు, ఇంటర్‌లో 300కు 300 మార్కులు సాధించగలిగా. పదో తరగతి వరకు హైదరాబాద్‌లోని సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో, ఇంటర్ కూకట్‌పల్లి నారాయణ జూనియర్ కళాశాలలో చదివా. హైస్కూల్ దశలో ఇంగ్లిష్ టీచర్ విలాసిని, సోషల్ టీచర్ అంస్తా నన్ను ఎక్కువగా ప్రోత్సహించేవారు. సామాజికంగా ఎలా మెలగాలి.. ఏ విధంగా సాగితే ఉన్నతంగా ఎదుగుతారనే విలువలు నేర్పించి నా కెరీర్‌కు తోడ్పాటు అందించారు. వారి మార్గదర్శకమే నేను ఐఏఎస్ సాధించేందుకు దోహదపడింది. వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాను. విద్యార్థులు గురువులు చెప్పే విషయాలను పాటిస్తూ వారి సూచనలకు అనుగుణంగా ముందుకు సాగితే తప్పకుండా జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదుగుతారు. గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులందరికీ నా శుభాకాంక్షలు.

– రాహుల్‌రాజ్, కలెక్టర్

ఉపాధ్యాయ వృత్తి నుంచే వచ్చా..



నేను ఉపాధ్యాయ వృత్తి నుంచే రాజకీయాల్లోకి వచ్చాను. 1987లో బోథ్ మండలం మహదుగూడలో గిరిజనశాఖ ఉపాధ్యాయుడిగా నియమితుడయ్యాను. వివిధ పాఠశాలల్లో 15 ఏళ్ల పాటు విధులు నిర్వర్తించా. ఈ క్రమంలో 2004లో ఉపాధ్యాయ వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చి టీఆర్ఎస్‌లో చేరాను. బోథ్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందాను. 2019లో బీజేపీ నుంచి ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేసి ఎంపీగా గెలిచాను.

– సోయం బాపూరావ్, ఎంపీ, ఆదిలాబాద్

23 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలోనే..



నేను ఉపాధ్యాయ వృత్తి నుంచే రాజకీయాల్లోకి వచ్చాను. 1986లో ఆదిలాబాద్ మండలం చింతగూడ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక ఉపాధ్యాయుడిగా నియమితుడయ్యాను. దాదాపు 23ఏళ్ల పాటు అదే వృత్తిలో కొనసాగాను. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి ఆకర్షితుడినై 2009లో ఉద్యోగానికి రాజీనామా చేశాను. కేసీఆర్ సమక్షంలో అప్పటి టీఆర్ఎస్(ప్రస్తుత బీఆర్ఎస్)లో చేరాను. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014, 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచాను. ఉపాధ్యాయుడిగా ఉన్న క్రమశిక్షణ రాజకీయాల్లో ఉపయోగపడింది.

– రాథోడ్ బాపూరావ్, ఎమ్మెల్యే, బోథ్

జీవిత పాఠాలు నేర్పించారు



మాది ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని రామచంద్రాపురం గ్రామం. అక్కడ 1నుంచి 5వ తరగతి వరకు చదివాను. 6, 7 తరగతులు మూడు కిలోమీటర్లున్న పక్క ఊరికి నడిచివెళ్లి చదివాను. ఆ తర్వాత 9, 10 తరగతులు సైకిల్‌పై వెళ్లేవాడిని. నాపై టీచర్ల ప్రభావం చాలా ఉండేది. వారంటే చాలా గౌరవం, మర్యాదగా మెలిగేవాళ్లం. 1 నుంచి 7వ తరగతి వరకు బోధించిన ఉపాధ్యాయులు శ్రీరాములు, నారాయణరెడ్డితో పాటు మా బాబాయి వెంకట్‌రెడ్డిలు ఏ విధంగా చదవాలి.. అందరితో ఎలా మెలగాలనే విషయాలను తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా చదవాలని అప్పట్లో నా గురువులు చెప్పేవారు. మాది వ్యవసాయ కుటుంబం. ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో చదివాను. సందేహాలుంటే ఉపాధ్యాయులను ఎప్పటికప్పుడు అడిగి నివృత్తి చేసుకునేవాడిని. నా ఎదుగుదలలో వారి ప్రోత్సాహం ఎంతో ఉంది. గురువులు విద్యార్థుల భవిష్యత్ గురించే ఆలోచిస్తారు. అది మరువద్దు.

– ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ

జ్యోతి మేడమ్ స్ఫూర్తితోనే ఈ స్థాయికి..



నేను పదకొండేళ్ల వయస్సు వరకు బాల కార్మికురాలిగా వివిధ రకాల పనులు చేశాను. చదువుకునే స్తోమత, ఆసక్తి రెండూ ఉండేవి కావు. కానీ భుక్తాపూర్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పీడీగా పనిచేసిన జ్యోతి మేడం నా సమస్యను గుర్తించి నన్ను చదువుకునేలా ప్రోత్సహించింది. పాఠశాలలో చేర్పించడమే కాకుండా నాకు అన్ని విధాలుగా అండగా నిలిచి చదువు అవశ్యకతను తెలిపారు. ఆ మేడం ఇచ్చిన స్ఫూర్తితో చదువుపై దృష్టి పెట్టాను. ఇంటర్, డిగ్రీ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో చదివాను. ఓయూలో పీజీ పూర్తి చేశా. ప్రస్తుతం జాతీయ మైనార్టీ కమిషన్ మెంబర్‌గా, విద్యావంతురాలిగా ఎదిగానంటే అందుకు జ్యోతి మేడం అందించిన సహకారమే. ప్రస్తుతం హైదరాబాద్ బాలభవన్‌లో పనిచేస్తున్న ఆ టీచర్ చేసిన మేలు ఎన్నటికీ మరిచిపోలేను. ఆదర్శవంతులైన ఉపాధ్యాయుల మార్గదర్శనంలో ముందుకు సాగితే ఎవరైనా ఉన్నత స్థానంలో ఉంటారనేందుకు నేనే ఉదాహరణ.

– సయ్యద్ షెహజాది, జాతీయ మైనార్టీ కమిషన్ మెంబర్

కాంగ్రెస్‌లో ఉత్కంఠ

- నియోజకవర్గానికి ముగ్గురు పేర్లకు మార్క్
- పీఈసీలో ఆమోదంతో స్క్రీనింగ్ కమిటీ ముందుకు..
- నేడు డీసీసీ అధ్యక్షులతో హైదరాబాద్‌లో సమావేశం

సాక్షి,ఆదిలాబాద్: కాంగ్రెస్‌లో ఉత్కంఠ మొదలైంది. రానున్న ఎన్నికల నేపథ్యంలో పోటీకి ఆసక్తి కనబరుస్తూ ఆయా నియోజకవర్గాల నుంచి ఇప్పటికే పలువురు అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ఈమేరకు ఆశావహుల జాబితాకు సంబంధించి వడపోత షూరు అయింది. ఈ దరఖాస్తులను ప్రదేశ్ ఎలక్షన్ కమిటి (పీఈసీ)లో పరిశీలన పూర్తయింది. అందులో నియోజకవర్గానికి ముగ్గురు పేర్లను సూచించారు. దాన్ని స్క్రీనింగ్ కమిటీ ముందుకు పంపారు. ఈ మూడు పేర్లపై పార్టీలో సీనియర్ నాయకులతో సోమవారం చర్చించనున్నారు. మంగళవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో డీసీసీ అధ్యక్షులతో సమావేశం నిర్వహిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

'హస్తం' పార్టీలో గాంధీభవన్ వేదికగా నియోజకవర్గం వారీగా గతనెల 18 నుంచి 25వరకు ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాల నుంచి 94 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిలో బోథ్ నియోజకవర్గం నుంచి 18, ఖానాపూర్ 15, చెన్నూర్ 13, ఆసిఫాబాద్ 10, బెల్లంపల్లి 10, ఆదిలాబాద్ 8, మంచిర్యాల 7, నిర్మల్ 5, ముథోల్ 4, సిర్పూర్ నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. వీటిపై ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వివిధ అంశాల ఆధారంగా వడపోత కొనసాగింది. ఒక్కో నియోజకవర్గానికి ముగ్గురు అభ్యర్థులను సూచిస్తూ స్క్రీనింగ్ కమిటీకి ఆ పేర్లను వారు పంపించారు.

నేడు డీసీసీ అధ్యక్షులతో సమావేశం..

హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో సీనియర్ నాయకులతో ఈ మూడు పేర్లపై అధిష్టానం సోమవారం చర్చించింది. మంగళవారం డీసీసీ అధ్యక్షులతో సమావేశం కానుంది. ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్ నుంచి సాజిద్‌ఖాన్, నిర్మల్ నుంచి శ్రీహరిరావు, మంచిర్యాల నుంచి కొక్కిరాల సురేఖ, కుమురంభీం ఆసిఫాబాద్ నుంచి విశ్వప్రసాద్‌రావు హాజరు కానున్నారు. పీఈసీ టిక్ చేసిన నియోజకవర్గానికి మూడు పేర్ల జాబితా బయటకు రాలేదు. డీసీసీ అధ్యక్షులతో సమావేశం అనంతరం ఎవరు ముగ్గురనేది తెలిసే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో తీవ్ర పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో స్క్రీనింగ్ కమిటీలో ఈ మూడు పేర్లపై సూక్ష్మంగా పరిశీలన జరగనున్నట్లు జిల్లా నేతలు చెబుతున్నారు. ప్రధానంగా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేతో పాటు అభ్యర్థుల అంగ, అర్థబలంతో పాటు ఆర్థిక వనరులు, తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా కాంగ్రెస్‌లో జరుగుతున్న ఈ పరిణామం ఆ పార్టీలో ఆసక్తి కలిగిస్తుంది.

అర్హులందరికీ రుణమాఫీ అందేలా చర్యలు

- రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

కైలాస్‌నగర్: అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఐకేరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి వివిధ ప్రభుత్వ కార్యక్రమాల అమలు, లక్ష్యాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతు రుణమాఫీ, ఆసరా పింఛన్లు, కారుణ్య నియామకాలు, ఇంటి పట్టాల పంపిణీ, గృహలక్ష్మి, జీవో 59 వంటి పలు అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ఇందులో కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్లు కుష్బూ గుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి రెండోసారి ఉత్తమ అవార్డు

- అధికారుల తీరుపై ఉపాధ్యాయ సంఘాల మండిపాటు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా విద్యాశాఖ అధికారుల తీరుపై ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఒక ఉపాధ్యాయుడు ఒక హోదాలో ఒకేసారి మాత్రమే ఉత్తమ అవార్డు తీసుకోవాలి. హోదా మారితే తప్ప మరోసారి తీసుకోరాదు. 2020 కోవిడ్ సమయంలో జిల్లాలో 65మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. అప్పట్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించలేదు. మండలస్థాయిలో ఎంఈవోలు, అధికారులు వెళ్లి ప్రశంసపత్రాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఆ ఏడాది డీఈవోగా రవీందర్‌రెడ్డి ఉన్నారు. బోథ్ ఆదర్శ మోడల్ స్కూల్‌కు చెందిన ప్రధానోపాధ్యాయుడు ఉమేష్‌ను ఎంపిక చేసి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేశారు. అయితే ఈఏడాది సైతం ఆ ఉపాధ్యాయుడిని ఎంపిక చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విషయాన్ని జిల్లా విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా, అప్పట్లో ఆయనకు అవార్డు ఇవ్వలేదని తప్పు కప్పిపుచ్చే యత్నాలు చేస్తున్నారని టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలెందర్‌రెడ్డి పేర్కొంటున్నారు. మో డల్ స్కూల్ విభాగంలో ఇదివరకే అవార్డు పొందిన ఆ ఉపాధ్యాయుడికి బదులు మరో టీచర్‌కు అవార్డు ఇస్తే న్యాయంగా ఉంటుందని తెలిపారు.

అర్హులకే అండగా నిలవాలి



మాట్లాడుతున్న షెహజాది



సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

- సంక్షేమ పథకాల అమలులో పక్షపాత వైఖరి చూపొద్దు
- జాతీయ మైనార్టీ కమిషన్ మెంబర్ షెహజాది
- పలువురు అధికారులపై ఆగ్రహం

కైలాస్‌నగర్: సంక్షేమ పథకాల అమల్లో అధికారులు పక్షపాత వైఖరి ప్రదర్శించకుండా అర్హులకే అండగా నిలువాలని జాతీయ మైనార్టీ కమిషన్ మెంబర్ సయ్యద్ షెహజాది అన్నారు. మైనార్టీల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి శాఖల వారీగా మైనార్టీలకు అందుతున్న ప్రయోజనాలపై సమీక్షించారు. విద్యాశాఖపై జరిగిన చర్చలో డీఈవో ప్రణీత సరైన వివరాలు చెప్పకపోవడంతో ఆఫీసుకు వచ్చి కూర్చుంటే సరిపోదని పని జరగాలన్నారు. సమాచారం లేకుండా సమావేశానికి హాజరయ్యారా.. అంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రశ్నించగా.. డీవైఎస్‌వో సమావేశంలో అందుబాటులో లేరు. వస్తున్నారని డీఎండబ్ల్యూవో చెప్పగా నా పెళ్లికి వస్తున్నారా .. భోజనాలు చేసేందుకు వస్తున్నారా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఎంఈజీపీ కింద మైనార్టీలకు అందించిన రుణాలపై పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషణ్‌రాజును ప్రశ్నించగా.. ప్రతి సోమవారం తమ కార్యాలయంలో రుణాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యాలయంలో కాదు.. ప్రజల్లోకి వెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రధానమంత్రి 15 కార్యక్రమాల అమలు కమిటీపై జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిని ప్రశ్నించగా ఆమె మరో కమిటీ వివరాలను తెలిపారు. వెంటనే జిల్లా కమిటీ ఏర్పాటు చేసి ప్రతి మూడు నెలలకోసారి సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మైనార్టీల సంక్షేమానికి జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలన్నారు. బాల్యవివాహాలు జరగకుండా ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ప్రతీ అధికారి ప్రజలిచ్చే పన్నుల నుంచి వేతనాలు తీసుకుంటున్నారని, అలాంటప్పుడు సంక్షేమ పథకాల మంజూరులో పార్టీల పరంగా లబ్ధి చేకూర్చడం సరికాదన్నారు. అర్హులైన వారందరికీ న్యాయం చేయాలని సూచించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ.. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను అర్హులైన మైనారిటీలకు వందశాతం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం పలువురు మైనార్టీల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆమెను అధికారులు శాలువాతో సత్కరించారు. సమావేశంలో ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో స్రవంతి, జిల్లా మైనారిటి సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

- జిల్లాలో 72 మంది ఎంపిక
- నేడు జెడ్పీ సమావేశ మందిరంలో సన్మానం

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సన్మానించనున్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. జిల్లాలో మొత్తం 72మంది ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరికి అతిథుల చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందించడంతో పాటు సత్కరించనున్నారు. ఇక భీంపూర్ మండలం నిపాని పాఠశాలకు చెందిన సంతోష్‌కుమార్ బెదోడ్కర్ జాతీయ స్థాయికి ఎంపికైన విషయం తెలిసిందే. ఈయన ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.

జిల్లాలో అవార్డు పొందిన టీచర్లు వీరే..

పీజీహెచ్ఎం విభాగంలో

ఉపాధ్యాయుడి పేరు పాఠశాల పేరు
ఆర్.అరుణ(జెడ్పీఎస్ఎస్, నార్నూర్)
డి.రాజేశ్వర్ రెడ్డి(జెడ్పీఎస్ఎస్, తాంసి)
సీహెచ్ శీతల్(జెడ్పీఎస్ఎస్, పెర్కగూడ)

స్కూల్ అసిస్టెంట్ విభాగంలో..

పి.వెంకటేశ్వర్‌రావు(ఎంపీయూపీఎస్, తంతోలి)
గంధ్రత్ నారాయణ(జీహెచ్ఎస్,తాటిగూడ)
బజ్జంకిరవీంద్ర(జీహెచ్ఎస్,కోలిపుర)
బి.బాలప్రసాద్(జీహెచ్ఎస్,నం.2, ఆదిలాబాద్)
టి.ప్రకాశ్(ఎంపీపీఎస్,రణదీవనగర్)
ఆర్డీవీప్రసాద్(బజార్‌హత్నూర్)
ఎ.లక్ష్మణ్(జెడ్పీఎస్ఎస్, మర్లపల్లి, బోథ్)
పి.మయాకర్(ఎంపీయూపీఎస్, పాటన్, బేల)
బి.లింగన్న(జెడ్పీఎస్ఎస్, ఇచ్చోడ)
జెడ్.రమేశ్(జెడ్పీఎస్ఎస్, ఇచ్చోడ)
అజీజుల్లాఖాన్ నవీద్(జెడ్పీఎస్ఎస్, కేశవపట్నం)
లింగారెడ్డి యూపీఎస్, మచ్చాపూర్
ఎ.వేణుగోపాల్(జీహెచ్ఎస్, గుడిహత్నూర్)
నిర్మల్కర్ విశ్వాస్(జెడ్పీహెచ్ఎస్, ఇంద్రవెల్లి)
ఎస్.గంగయ్య(జెడ్పీహెచ్ఎస్, ధనోర(బి))
రాథోడ్ బలిరాం(జెడ్పీహెచ్ఎస్, ఇంద్రవెల్లి)
డి.అశోక్‌కుమార్(జెడ్పీఎస్ఎస జైనథ్)
షహనాజ్‌బాను(జెడ్పీఎస్ఎస్, ఉర్దూ మీడియం)
జగదీశ్వర్‌రెడ్డి(జెడ్పీహెచ్ఎస్, నేరడిగొండ)
ఎం.మురళీధర్(జెడ్పీహెచ్ఎస్, తలమడుగు)
డి.వెంకన్న (జెడ్పీహెచ్ఎం, ఖోడద్)

పీఎస్‌హెచ్ఎం విభాగంలో..

డి.సత్యనారాయణ(ఎంపీపీఎస్, పొచ్చర)
ఆడె కాశీరాం (ఎంపీపీఎస్, రాంనగర్)
కె.వెంకటరమణ(జెడ్పీహెచ్ఎస్, దీపాయిగూడ)

ఎల్పీ(తెలుగు)

దారట్ల కవిత (యూపీఎస్, భుక్తాపూర్, ఎంఎం)
ఎస్.రాజేశ్వర్(జెడ్పీహెచ్ఎస్, బేల)
టి.జ్యోత్స్న(ఎంపీయూపీఎస్, తరోడ)
ఎ.దేవిదాస్(జెడ్పీఎస్ఎస్, మేడిగూడరోడ్)
పి.వినోద్ (జెడ్పీఎస్ఎస్, సాలెవాడ(కె))

ఎల్పీ హిందీ..

మాలవికస్ శాస్త్రి(భీంపూర్)
సతీశ్‌కుమార్(జెడ్పీఎస్ఎస్, మన్నూర్)
పి.భాస్కర్ (జెడ్పీఎస్ఎస్, సిరికొండ)
పి.ఆతెం (ఎంపీయూపీఎస్, పొన్న)

ఎస్జీటీ..

ఎస్.జయంతి(ఎంపీపీఎస్, రాంపూర్ (ఆర్))
జి.సూర్యప్రకాశ్(ఎంపీపీఎస్, యాపల్‌గూడ)
బి.దేవేందర్ (ఎంపీపీఎస్, అంకోలి)
ఎ.మోతిబాయి(ఎంపీయూపీఎస్, రామాయి)
సిద్దీఖ సుల్తానా(ప్రైమరీ స్కూల్, ఖిల్లా)
తుల సదానందం (బజార్‌హత్నూర్)
ఎం.అనిత (బజార్‌హత్నూర్)
బి.గంగాధర్(బజార్‌హత్నూర్)
వసీమున్నిసాబేగం(ఎంపీయూపీఎస్, బేల)
స్వామి(ఎంపీపీఎస్, అశోక్‌నగర్)
ఎం.రమేశ్‌కుమార్(ఎంపీపీఎస్, పిప్పల్‌కోటి)
జి.శివారెడ్డి(భీంపూర్)
జియా ఉల్ ఇస్లామ్(ఎంపీపీఎస్, ఉర్దూ, బోథ్)
ఆర్.సరిత (ఎంపీపీఎస్, మర్లపల్లి)
ఎం.వెంకటరమణారెడ్డి(ఎంపీపీఎస్, ఇచ్చోడ)
బి.బాపురావు(ఎంపీపీఎస్, జామిడి)
ఆర్.కవిత (ఎంపీపీఎస్, ఇచ్చోడ, ఎస్సీకాలనీ)
జె.కేశవ్‌రావు(ఎంపీపీఎస్, బొద్దిగూడ)
నాగనాథ్(ఎంపీయూపీఎస్, గుడిహత్నూర్)
జె.హరీష్ కుమార్ (ఎంపీయూపీఎస్, జామిని)
ఎస్.ఎల్జాబేత్‌రాణి(ఎంపీపీఎస్, పిప్పర్‌వాడ)
ఎస్.గోపాల్(ఎంపీపీఎస్, గూడ)
మహ్మద్‌బేగం(ఎంపీయూపీఎస్, కేఆర్‌కే కాలనీ)
జాడే ఖుషాల్(ఎంపీపీఎస్, మావల-2)
సీహెచ్‌సంజయ్(ఎంపీయూపీఎస్,ముస్లింగూడ)
సుధరాణి(ఎంపీపీఎస్, వడూర్)
బి.ఊష(ఎంపీపీఎస్, సిరికొండ)
జి.సరిత(తాంసి)
ఆర్.రోజరాణి(తాంసి)
ఎంఏ జావిద్(ఎంపీపీఎస్, ఘొట్కురి)
ఆర్.గణేశ్(ఎంపీపీఎస్, యెంక)
ఆర్.శుభగనుడు(ఎంపీపీఎస్, దేవపూర్)
ఎస్.కృష్ణసాగర్ (ఎంపీయూపీఎస్, రుయ్యాడి)
పి.రాయేష్(పీఈటీ)జెడ్పీహెచ్ఎస్, ధనోర(బి)
ఉమేష్‌చంద్ర(పీపీఎల్)టీఎస్ఎంఎస్, బోథ్
గెడం ప్రియాంక(ఎస్ఓ)కేజీబీవీ, ఇంద్రవెల్లి

ఉట్నూర్ ట్రైబల్ వెల్ఫేర్..

జె.ప్రేమ్‌దాస్(పీజీహెచ్ఎం)జీపీహెచ్ఎస్(బి), ఝరిపూనగూడ
టి.భూమన్న(ఎస్ఏ)జీపీహెచ్ఎస్(బి),పార్డి(బి)
బి.రాజన్న(పీఎస్‌హెచ్ఎం)జీఏహెచ్ఎస్(జి) ఉట్నూర్
కె.ఆనంద్‌రావు(ఎస్జీటీ)టీడబ్ల్యుపీఎస్ రత్నాపూర్
జి.రాములు(పీఈటీ)జీపీహెచ్ఎస్(బి)ఉట్నూర్.

క్లుప్తంగా

జాతీయ అవార్డుకు ఎంపికైన టీచర్‌పై విచారణ

ఆదిలాబాద్‌టౌన్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన బెదోడ్కర్ సంతోష్‌పై వరంగల్ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి కేంద్రానికి ఆయనపై ఫిర్యాదు చేశారు. దీంతో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ దేవసేన ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. పాఠశాలలోని హెచ్‌ఎం, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఎంఈవో, ఆ చుట్టుపక్కల పాఠశాల హెచ్‌ఎంలను డీఈవో కార్యాలయంలో వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఈవో ప్రణీత నుంచి వివరాలు సేకరించారు. జాతీయ అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయుడు జన విజ్ఞానవేదికలో పనిచేస్తున్నాడని, ఆయన విధులు సక్రమంగా నిర్వహించడని, తదితర విషయాలతో ఆయనపై ఫిర్యాదు చేశారు. కాగా, ఈ టీచర్ మంగళవారం ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు.


ఒకరి రిమాండ్

నర్సాపూర్(జి): దొంగతనం కేసులో ఒకరిని సోమవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రానికి చెందిన బుజ్జల చంద్ర మోహన్ తన కిరాణా దుకాణానికి ఆదివారం తాళం వేశాడు. సోమవారం ఉదయం చూడగా తాళం పగుల గొట్టి ఉంది. రూ.4 వేల విలువైన కిరాణా వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. దొంగిలించిన వస్తువులను అమ్ముతున్నారని సమాచారంతో నర్సాపూర్ (జి) గ్రామానికి చెందిన తక్కల మహేశ్‌ను పట్టుకున్నారు. విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం నిర్మల్ కోర్టుకు తరలించినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

పట్టపగలే చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్‌లో గల కొండయ్య చౌదరి అపార్ట్‌మెంట్‌లో టీచర్ నాగరాజు, ఎల్‌ఐసీ ఉద్యోగి రవికిరణ్ రెండు ఇళ్లలో సోమవారం పట్టపగలే చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం..ఇంటికి తాళం వేసి వేరే గ్రామానికి వెళ్లగా గమనించిన దొంగలు టీచర్ ఇంట్లో 16 తులాల బంగారం, ఎల్‌ఐసీ ఉద్యోగి ఇంట్లో 45 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఫింగర్ ప్రింట్‌లను సేకరించారు. ఈ విషయంపై మావల పోలీసులను సంప్రదించగా చోరీ జరిగిన మాట వాస్తవమే నన్నారు. ఇప్పటి వరకు తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన సామగ్రి

పెంబి: షార్ట్ సర్క్యూట్‌తో ఫ్రిజ్ పేలి ఇల్లు దగ్ధమైంది. పెంబి మండలంలో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పస్పుల గ్రామానికి చెందిన ఆత్రం లక్ష్మణ్ తన భార్య గర్భిణి కావడంతో నిర్మల్ ఆసుపత్రికి వెళ్లారు. తర్వాత బంధువుల ఇంటి వద్ద భార్యను వదిలి ఆలస్యంగా ఆదివారం రాత్రి పస్పులలోని తన ఇంటికి వచ్చాడు. సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లి భోజనం చేసి తిరిగివచ్చాడు. అప్పటికే షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అప్పటికే ఇంట్లో రూ.2 లక్షల 60వేలు, బియ్యం, పప్పు, తదితర సరుకులు, సామగ్రి, బట్టలు కాలిపోయాయి. దాదాపు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. అధికారులు వెంటనే ఆదుకోవాలని కోరాడు.

బోధనలో ఉత్తమం



- ఫలితాలు సాధించేలా టీచర్ల కృషి
- సొంత ఖర్చులతో పుస్తకాలు
- సేవల్లో భాగస్వాములవుతూ..

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న రీతిలో విద్యాబోధన చేస్తున్నారు. విద్యార్థుల్లో పాఠనాసక్తి కలిగించి నూతన పద్ధతులు, ప్రయోగాల ద్వారా వివరిస్తున్నారు. పిల్లలు మంచి ఫలితాలు సాధించేలా గురువులు కృషి చేస్తున్నారు. మరికొందరు సేవా కార్యక్రమంలోనూ భాగస్వాములవుతున్నారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహిస్తారు. ఉత్తమ సేవలందిస్తున్న టీచర్లపై 'సాక్షి' కథనం.

టిశాట్‌లో సతీశ్ పాఠాలు



బోథ్: మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న భైరి సతీశ్‌కు మార్ టిశాట్‌లో రెండేళ్లుగా గణితం పాఠాలు బోధిస్తున్నారు. కరోనా నేపథ్యంలో ఎస్‌ఈఆర్టీ ఆధ్వర్యంలో డీడీ యాదగిరి చానల్‌లో ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించారు. కృత్యపత్రాల తయారీలో భైరి సతీష్‌కు చోటు లభించింది.రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులకు ఇంగ్లీష్ మెంటర్‌గా అవకాశం వచ్చింది. జాతీయస్థాయిలో పలు అవార్డులు అందుకున్నారు. ఇండియన్ టీచర్స్ సైంటిస్ట్ ఇన్నోవేషన్ అవార్డులో దేశంలో టాప్ 5లో చోటు లభించింది. తెలంగాణ నుంచి కేవలం సతీశ్ ఎంపికయ్యారు.

మా నాన్నే నాకు స్ఫూర్తి



ఆదిలాబాద్‌టౌన్: మాది జగిత్యాల. మా నాన్న పుప్పాల రామచంద్రం గణితం, సైన్స్ బోధించేవారు. హెచ్‌ఎంగా విధులు నిర్వహించారు. నాన్న ఉపాధ్యాయులు కావడంతో బదిలీ అయినప్పుడు పలు చోట్ల విద్యాభ్యాసం చేశాను. గురువులు నర్సింహారెడ్డి, శంకర్ ప్రోత్సహించేవారు. హైదరాబాద్‌లోని మాసబ్ ట్యాంక్‌లో పాలిటెక్నిక్ చదివాను. లెక్చరర్ ని రంజన్‌రావు పలు అంశాలను వివరించేవారు.

– పుప్పాల శ్రీనివాస్, డీటీసీ, ఆదిలాబాద్

ఉపాధ్యాయుడిగా పనిచేసి..



బోథ్: మాజీ ఎంపీ గొడం నగేశ్ ఏడేళ్లు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు. మొదటి సారిగి 1986లో బజార్‌హత్నూర్ మండలం వితల్‌గూడ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. తర్వాత బోథ్ మండలం పార్డి(బి) ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎంగా, బజార్‌హత్నూర్ మండలం తన స్వంత గ్రామమైన జాతర్ల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌పై పదోన్నతిపై బదిలీ అయ్యారు. తండ్రి రామారావు ఎమ్మెల్యేగా ఉండటంతో రాజకీయాలపై మక్కువ పెంచుకున్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేశారు. ఎంపీగా గెలిచారు.

గుర్తింపు లభించింది



కుంటాల: మండలంలోని పెంచికల్ పాడ్ ప్రాథమిక పాఠశాలలో గుణాత్మకమైన విద్య, వ్యక్తిగత పరిశుభ్రత, కాలుష్య నివారణపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. రాష్ట్రంలోనే ది బెస్ట్ ప్రైమరీ స్కూల్ గా గుర్తింపు లభించింది. ఇటీవల పాఠశాల సక్సెస్ స్టోరీని ఎస్‌సీఈఆర్టీ తెలంగాణ ప్రచురించిన ఇన్ ఫ్లూయెన్స్, ఇన్స్పిరేషన్ పుస్తకంలో ప్రత్యేక గుర్తింపు లభించింది. ఐసీటీ ద్వారా స్మార్ట్ డిజిటల్ పాఠశాలగా రూపుదిద్దుకుంది.

మ్యాదరి ఎల్లన్న, హెచ్‌ఎం, పెంచికల్‌పాడ్

నేలపై పటాలు వేసి..



సోన్: కడం మండలం లింగాపూర్‌కు చెందిన కుర్ర శేఖర్. జెడ్పీఎస్‌ఎస్ న్యూ వెల్మల్ బొప్పారం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు. నేల పై గ్లోబు, ఇండియా, తెలంగాణ, అన్ని ఖండాలు, పర్వతాల పటాలు వివిధ ఆకృతిలో వేసి విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించడంలో ఆయనే సాటి. ఆయన కృషిని గుర్తించిన అధికారులు సత్కరించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, విద్యా సేవ రత్న అవార్డులు దక్కాయి

చార్ట్‌లతో బోధన



నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు మనోహర్‌రెడ్డి నర్సాపూర్(జి) ఉన్నత పాఠశాలలో గణితశాస్త్రం బోధిస్తున్నారు. కోవిడ్ వల్ల విద్యార్థుల్లో ఆలోచన ధోరణి పెంపొందించేలా కత్యాధార పద్ధతుల ద్వారా గణితాన్ని బోధించారు. గుణింతాలు, బీజగణితం, ఆల్జీబ్రా తదితర అంశాలను చార్ట్‌లు, మాడ్యూల్స్ ద్వారా వివరించారు. గణితంలో ఈయన చేసిన పరిశోధనలకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్నారు.

ప్రత్యేక బోధనలో ప్రతిభ



జాడి శ్రీనివాస్



బాలాజీ

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల బోధనలో తమకంటూ ప్రత్యేకతను చాటుతున్నారు. విద్యార్థులు చదువులో రాణిస్తూ ఉత్తమప్రతిభ కనబరుస్తున్నారు. ఈ ఏడాది విడుదలైన ఎన్‌ఎంఎంఎస్ ఉపకారవేతనానికి 18 మంది, తాజాగా బాసర ట్రిపుల్ ఐటీలో 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల హెచ్‌ఎం బాలాజీతో పాటు ఉపాధ్యాయుడు జాడి శ్రీనివాస్ తదితరుల చొరవతో విద్యార్థులు చదువులో రాణిస్తున్నారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్ సొంత డబ్బులు రూ.65వేలు వెచ్చించి పాఠశాలకు వివిధ హంగులను సమకూర్చారు.

గురువుల ప్రోత్సాహంతో..



ఆదిలాబాద్‌టౌన్: మాది నేరడిగొండ మండలంలోని చిన్నబుగ్గారం. గ్రామంలో, పార్డి (బి)ఆశ్రమ పాఠశాల, నిర్మల్‌లోని జుమెరాత్ పేటలోని హైస్కూల్‌లో పదోతరగతి పూర్తి చేశారు. గురువు చందు లాల్, రాజయ్య, వెంకట్‌రాంరెడ్డిలు నా ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారు. ఇంటర్ క్వాలిఫికేషన్‌తో ఐటీడీఏలో ఉపాధ్యాయ ఉద్యోగంతో పాటు పోస్టల్ జాబ్ వచ్చింది. ఇందులో చేరినప్పటికీ సెలవు పెట్టా. ఆ తర్వాత ఎంసెట్ రాస్తే ఉస్మానియా ఆస్పత్రిలో సీటు వచ్చింది. ఆర్థిక పరిస్థితులతో వరంగల్ మెడికల్ కళాశాలకు మ్యూచువల్ టాన్స్‌ఫర్ పెట్టుకున్నా. బెల్లంపల్లిలోని సింగరేణి ఆస్పత్రిలో వైద్యుడిగా చేరా. తర్వాత సారంగాపూర్ రెగ్యులర్ వైద్యుడిగా, నిర్మల్‌లో డిప్యూటీ డీఎంహెచ్ఓగా పనిచేశాను. పీజీ అర్థోపెడిక్ సీటు వచ్చింది. వరంగల్‌లో అసిస్టెంట్, తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్‌గా, నల్గొండ జిల్లాలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించి అక్కడినుంచి రిమ్స్ డైరెక్టర్‌గా ఆదిలాబాద్‌లో పనిచేస్తున్నా.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్

పోలీసు అధికారుల సమావేశం



మాట్లాడుతున్న ఏసీపీ తిరుపతిరెడ్డి

జన్నారం/కడెం: రామగుండం సీపీ రెమా రాజేశ్వరి ఆదేశాలతో జన్నారంలోని హరిత రిసార్ట్‌లో సోమవారం నిర్మల్, మంచిర్యాల జిల్లాల పోలీసు అధికా రుల సమావేశం నిర్వహించారు. మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి హాజరయ్యారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా సరిహద్దు జిల్లాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రణాళికలు రూపొందించడానికి ముందస్తు సమావేశం నిర్వహించినట్లు ఏసీపీ తిరుపతిరెడ్డి తెలి పారు. సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల ప్రాబ ల్యం, ఎన్నికల్లో మద్యం, డబ్బు నియంత్రణకు చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల రవాణా నియంత్రణకు ప్రత్యేక ని ఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఖానాపూర్ సీఐ మోహన్, నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, మంచిర్యాల రూరల్ సీఐ సంజీవ్, లక్సెట్టిపేట సీఐ కృష్ణ, జన్నారం, కడెం, దస్తురాబాద్ ఎస్సైలు సతీశ్, రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని 11 గొర్రెలు మృతి



మృతి చెందిన గొర్రెలు

జైపూర్: మండలంలోని ఇందారం బస్టాండ్ సమీపంలో గల రాజీవ్ రహదారిపై సోమవారం లారీ ఢీకొని 11 గొర్రెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. రేచిన్‌కు చెందిన గొల్లకాపరి ముద్వి రమేశ్ ఇందారం సమీపంలో గొర్రెలు పెంచుతూ సంచార జీవనం సాగిస్తున్నాడు. ఇదేక్రమంలో ఇందారం ఈసూబ్ ఫంక్షన్‌హాల్ సమీపంలో గొర్రెలు మేపుతుండగా శ్రీరాంపూర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ గొర్రెల మందను ఢీకొట్టడంతో 11 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.లక్షకు పైగా ఉంటుందని బాధితుడు వాపోయాడు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్ పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజనుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీలను శాఖల వారీగా పరిశీలించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో కనక భీంరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌ఓ కుమ్ర బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌ఓ సందీప్, ఆర్‌సీఓ గంగాధర్, జేడీఎం నాగభూషణం, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, ఐటీడీఏ మేనేజర్ లింగు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న చాహత్ బాజ్‌పాయ్

- తనకు అటవీ హక్కు పత్రం మంజూరు చేయాలని ఆదిలాబాద్ మండలం యాపల్‌గూడకు చెందిన గంగన్న విన్నవించాడు.
- ఆశ్రమ పాఠశాలలో సీఆర్టీ ఉద్యోగం ఇప్పించాలని ఇంద్రవెల్లి మండలం గిన్నెదరి గ్రామానికి చెందిన రాథోడ్ ఆశ అర్జీ సమర్పించింది.
- స్వయం ఉపాధికి రుణం మంజూరు చేయాలని జైనూర్ మండలం జామిని గ్రామానికి చెందిన వినోద్ వినతిపత్రం అందించాడు.
- పిండిగిర్నీ దుకాణం కోసం ఆర్థి కసాయం అందించాలని ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ సచిన్ కోరారు.

కడెం ప్రాజెక్ట్ నాలుగు గేట్లు ఎత్తివేత



కడెం: ఎగువన కురుస్తున్న వర్షాలతో కడెం ప్రాజెక్ట్‌లోకి భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. సోమవారం 36,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు నాలుగు వరద గేట్లను ఎత్తి 56,429 క్యూస్కెకుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్ట్ పూర్తి నీటిమట్టం 700(7.603టీఎంసీ) అడుగుల కాగా, ప్రస్తుతం 695.875(6.568టీఎంసీ) అడుగుల నీటిమట్టం ఉన్నట్లు వెల్లడించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



నవీన్‌కుమార్ మృతదేహం

భైంసారూరల్: మండలంలోని ఎగ్గాం గ్రామానికి చెందిన మాముళ్ల నవీన్‌కుమార్(18) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. నవీన్ గత సంవత్సరం టెన్త్ పూర్తి చేసి గేదెలు మేపుతున్నాడు. కుటుంబీకులు కాలేజీకు వెళ్లాలని చెప్పినా నవీన్ చదివేందుకు ఇష్టపడేవాడు కాదు. చదువుకోవాలని ఒత్తిడి పెరగడంతో ఎప్పటిలాగే గేదెలు తీసుకుని సోమవారం పొలాల్లోకి వెళ్లి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి గజ్జవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ఒకరు..

గుడిహత్నూర్: మద్యం తాగొద్దని ఇంట్లో వాళ్లు మందలించారని మనస్తాపంతో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై ఇమ్రాన్ కథనం ప్రకారం.. ఇచ్చోడ మండలం దుబార్‌పేట్‌కు చెందిన జైతుబాయి, జనార్దన్ దంపతులు. వీరికి కాత్లే నందు (25) కుమారుడు ఉన్నాడు. వీరి కుటుంబానికి గుడిహత్నూర్ మండలం మామిడిగూడలో పొలం ఉంది. నందు ఆదివారం ఉదయం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు మందలించారు. ఇంటి పెద్దకొడుకుగా ఉన్న నువ్వు ఇలా తాగుబోతుగా మారితే ఎలా అంటూ ప్రశ్నించారు. దీంతో కోపంతో బయటకు వెళ్లాడు. తర్వాత ఇంటికి వచ్చి చేనులో పురుగు మందు చల్లి వస్తానని వెళ్లాడు. నందు వచ్చిన విషయం తెలిసిన అతని చిన్నాన్న కొడుకు దేవ్‌రావ్ సాయంత్రం నందు ఇంటికి రాలేదు. అనుమానంతో చేనులో పరిశీలించగా పురుగుల మందు తాగి పడిపోపయాడు. వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించాడు. స్థానికుల సాయంతో నందును అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యం

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలో ఓ మహిళ అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రానికి చెందిన అబ్దుల్ అజీజ్‌కు నిర్మల్‌లోని వైఎస్సార్‌నగర్‌కు చెందిన ఫర్జానా బేగంతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు. కొన్నిరోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భర్తను విడిచి తన తల్లిగారైన వైఎస్సార్‌నగర్‌లో తల్లితో కలిసి ఫర్జానా బేగం ఉంటోంది. ఆదివారం ఆస్పత్రికి వెళ్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పాముకాటుకు ఒకరు మృతి

దహెగాం(సిర్పూర్): పాముకాటుకు ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని పీకలగుండంలో చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. ఆదివారం రాత్రి ఇంట్లో కొడిపె మనోజ్‌కుమార్(16) నిద్రిస్తున్నాడు. రాత్రి 2 గంటల ప్రాంతంలో పాముకాటేసింది. ఏదో కుట్టిందని ఇంట్లో చెప్పాడు. సోమవారం ఉదయం కుంచవెల్లి వరకు ప్రైవేటు వాహనంలో తరలించి అక్కడి నుంచి 108 అంబులెన్సులో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అప్పటికే పరీక్షించిన వైద్యసిబ్బంది మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఎస్సై సనత్‌కుమార్ పీహెచ్‌సీకి చేరుకుని కుటుంబ సభ్యులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అన్నం కోసం వచ్చి... అసువులుబాసి..



అరుణ్‌కుమార్ మృతదేహం



రాజేందర్ మృతదేహం



ఆసుపత్రి వద్ద రోదిస్తున్న సరోజ

- విద్యుత్ షాక్‌తో భర్త, కొడుకు మృతి
- గుండెలు పగిలేలా రోదించిన తల్లి
- మంచిర్యాల జిల్లా కేంద్రంలో విషాదం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'కొడుకా.. ఓ నా కొడుకా.. నన్ను ఎట్లా సూత్తవు కొడుకా.. బువ్వ కోసం ఇంటికచ్చి, పాణం పోగొట్టుకుంటిరి తండ్రీ.. దేవుడా.. నన్ను కూడా కొంచవో..' అంటూ భర్త, కొడుకును ఒకేసారి కోల్పోయిన బాధితురాలి ఆవేదన అందరినీ కంటతడి పెట్టించింది. జిల్లా కేంద్రంలోని ఏసీసీ కాలనీలో విద్యుత్‌షాక్‌తో ఎడ్ల రాజేందర్(50), కొడుకు అరుణ్ కుమార్(17) సోమవారం మృతిచెందారు. సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న రాజేందర్, మెకానిక్‌గా పనిచేస్తున్న అరుణ్‌కుమార్ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చారు. దండెంపై రాజేందర్ టవల్ ఆరేస్తుండగా షాక్‌కు గురయ్యాడు. తండ్రిని కాపాడే ప్రయత్నంలో అరుణ్‌కుమార్ కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. రెప్పపాటులో భర్త, కొడుకు కళ్ల ముందే మృత్యువాత పడడంతో సరోజన గుండెలు పగిలేలా రోదించింది. ప్రభుత్వాసుపత్రి సరోజ విలపించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

తీరని విషాదం

తండ్రి, కొడుకు మరణంతో ఏసీసీ కాలనీలో విషాదం అలుముకుంది. ఆ కుటుంబంలో తీవ్ర దుఃఖం నింపింది. భర్త, కొడుకు మరణం తట్టుకోలేక రోదిస్తున్న సరోజను ఓదార్చడం ఎవరి తరం కావడం లేదు.

ప్రాణం ఉందనుకున్నా...



కరెంట్.. కరెంట్ అని మా వదిన మొత్తుకుంటే.. ఉరికిపోయిన. తీగను పట్టుకుని ముందట అన్న ఉన్నడు. ఎనుక కొడుకు ఉన్నడు. నాకు డౌట్ వచ్చి కట్టెతోని తీగను కొట్టిన ఇద్దరూ కింద పడ్డరు. నా కాళ్లపై పడుకోబెట్టుకుని చాతీ మీద గట్టిగా నొక్కిన. చుట్టుపక్కల వాళ్లు వచిచ సాయం చేసింద్రు. ఒక్కసారిగా శ్వాస తీసుకున్నరు. పాణం ఉందనుకుని ఆస్పత్రికి తీసుకపోయినం. కానీ ప్రాణాలు దక్కలేదు.

– సారయ్య, రాజేందర్, తమ్ముడు,

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–బాసర రహదారిపై విజయలక్ష్మి కాలనీ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మండలం వాలేగాం గ్రామానికి చెందిన కేశవరావు పటేల్ భైంసాలో కూరగాయలు కొనుగోలు చేసి బైక్‌పై తిరిగి వెళ్తున్నాడు. వెనుకవైపు నుంచి వచ్చిన కారు ఢీకొనడంతో మృతిచెందాడు.

